

ప్రభుత్వాసుపత్రికి బిపి యూనిట్ల అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట యువత ఆధ్వర్యంలో సామర్లకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు మూడు బిపి పరీక్షల యూనిట్‌లు బుధవారం బహుకరించారు. ఈ యూనిట్‌లను స్థానిక ఎస్ఐ వి.మౌనిక చేతులమీదుగా ఆసుపత్రి వైద్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యువత నాయకులు మాట్లాడుతూ స్థానిక ఆసుపత్రిలో ఉన్న అవసరాన్ని తెలుసుకుని సహాయం కోరగా కాకినాడ సోము దుర్గ ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు రాజ్‌కుమార్, స్వాతి అందించినట్టు చెప్పారు. కాగా సామర్లకోట యువత అవసరాల్లో ఉన్నవారికి అందించే సహాయ కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువత సభ్యులు దేవగురు చంద్రశేఖర్, జట్లా దుర్గా చైతన్య, జన్మహంతి రోహిత్ సమద్, అమలకంటి శివకృష్ణ, గెడ్డం వెంకట్, రెడ్డి నవీన్ సాయి, ఆసుపత్రి వైద్యులు, డాక్టర్లు రమేష్, రాకేష్, లక్ష్మి పాల్గొన్నారు.

ఏరువాకపై ఎన్నో ఆశలు

- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న అన్నదాతలు
- ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ
- 3.10 లక్షల ఎకరాల్లో పంటల సాగు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే భారత్ భూభాగంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించగా ఈనెలాఖరున కేరళ తీరాన్ని తాకనున్నాయని, ఆ తర్వాత ఏపీలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే తెలిపారు. సకాలంలోనే రాష్ట్రానికి నైరుతి రుతుపవనాలు రానుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో ప్రాజెక్టులు, చెరువులు నిండుకుంటే సాగుకి ఇబ్బందులు ఉండవు. ఏటా అనేక కష్టాలను అనుభవిస్తూ, నష్టాలకు గురవుతున్న అన్నదాతలు మళ్లీ ఖరీఫ్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసింది. దీనిలో భాగంగా జిల్లాలో సాగు లక్ష్యాన్ని నిర్దేశించడంతోపాటు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగవుతాయి. వాటికి రాయితీపై ఎన్ని విత్తనాలు అందించాలి, ఎరువులు ఎంత అవసరం ఇలా అన్నివిధాలుగా ప్రణాళిక సిద్ధం చేయడంతోపాటు ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించారు.

జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు, 6 సబ్ డివిజన్ల పరిధిలో 414 ఆర్‌బికెలు ఉన్నాయి. 415 రెవెన్యూ గ్రామాలున్నాయి. గతేడాది మాదిరిగా ఈ ఏడాది కూడా మళ్లీ అదే ప్రాంతాలకు సార్వాకు అవకాశం ఇవ్వడానికి నిర్ణయించారు. గతేడాది మాదిరిగానే జిల్లాలో 21 మండలాల్లో ఉన్న అన్ని ప్రాంతాలకు కాలువల ద్వారా ఈ ఏడాది కూడా ఖరీఫ్‌కు అవసరమైన నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తూర్పు డెల్టాతోపాటు ఏలేరు, పంపా, తాండవ, పుష్కర ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టు, మెట్ట మండలాల్లో సైతం వరి సాగుకి సన్నద్ధం అవుతున్నారు. ఎర్ర లోమీ, నల్ల బంకమట్టి, నల్ల లోమీ, ఇసుక లోమీ, బంకమట్టి లోమీ, ఎర్ర నేలలు, ఎర్రటి ఇసుక నేలలు సాగుకి అనుకూలంగా ఉన్నాయి. జిల్లాలో 1,94,828 మంది మొత్తం రైతులు 3,10,672 ఎకరాల్లో పంటలను సాగు చేయనున్నారు. వీరిలో 147457 మంది భూయజమానులు ఉండగా 47,371 మంది కౌలు రైతులుగా ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. వచ్చే నెల 15 నుంచి 20 వ తేదీ వరకూ నారుమళ్లు సిద్ధం చేసుకోవాలని, ఎదజల్లు సాగు చేసుకోవాలని, జూలై 15 నుంచి 20 లోపు నాట్లు వేయడాన్ని పూర్తి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.

రాయితీపై విత్తనాలు

ఖరీఫ్‌లో ఆయా ప్రాంతాల్లో సాగు చేసే పంటలను బట్టి అవసరమైన విత్తనాలను ప్రభుత్వం రాయితీపై ఇచ్చే విధంగా చర్యలు చేపట్టింది. ఆయా మండలాలకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వరి సాగుచేసే వారికి ఎంటీయూ-7029, 1064, 1061, 1318, 1262, 1121, 3626, బిపిటి 5204, ఆర్‌జిఎల్ 2537 తదితర రకాల విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. మొత్తంగా అన్ని రకాలు కలిపి 41522.52 మెట్రిక్ టన్నుల విత్తనాలు అవసరం ఉంటాయని అంచనా వేశారు. ఇందులో రైతుల వద్ద 17912 మెట్రిక్ టన్నులు, ప్రయివేటు డీలర్ల వద్ద 33831 టన్నులు, వివిధ సొసైటీల్లో 33831 టన్నులు, ఎపి సీడ్స్ వద్ద 7252 టన్నులు అందుబాటులో ఉన్నాయి. 25శాతం ఎరువులు, విత్తనాలను ఆర్‌బికెల ద్వారా పంపిణీ చేస్తారు.

ఖరీఫ్ లక్ష్యాలు ఇలా...

సాగు లక్ష్యం : 3.10 లక్షల ఎకరాలు
వరి : 2,26,685 ఎకరాలు
మొక్కజొన్న : 587 ఎకరాలు
పప్పు దినుసులు : 2667 ఎకరాలు
ప్రత్తి :7,992 ఎకరాలు
చెరకు : 5,520 ఎకరాలు
సిసిఎంస్‌ఆర్ లక్ష్యం : 46 వేలు
రుణాల లక్ష్యం : 19,000 లక్షలు
పొలం బడుల నిర్వహణ లక్ష్యం : 414

అవసరమైన ఎరువుల వివరాలు

యూరియా	: 26,532 టన్నులు
డిఎపి	: 7,458 టన్నులు
ఎంఒపి	: 6886 టన్నులు
కాంప్లెక్స్	: 4,349 టన్నులు
మొత్తం	: 58,995 టన్నులు
ఆర్‌బికెల్లో	: 17,912 మెట్రిక్ టన్నులు
డీలర్ల వద్ద	: 33,831 టన్నులు
సొసైటీల్లో	: 7,252 ఐచీశీఅవగటన్నులు

విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నాం

ఖరీఫ్ సంబంధించిన ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేసాం. ఆయా ప్రాంతాల్లో సాగుచేసే పంటలను బట్టి విత్తన రకాలను అందిస్తాం. అవసరమైన ఎరువులు సిద్ధం చేస్తున్నాం. ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు స్టాక్ సిద్ధంగా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

ఎన్.విజయ్ కుమార్, జెడి, వ్యవసాయశాఖ, కాకినాడ జిల్లా.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కాకినాడ



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నివాస్

ఓటర్ల నిజమైన ఎంపిక సరైన ఓట్ల లెక్కింపులోనే వ్యక్తమవుతుందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారంకలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెసి, పిఠాపురం ఆర్‌ఒ ఎన్.రామ్‌చంద్రర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక ఓట్ల లెక్కింపు, చెల్లుబాటు అయిన ఓట్ల లెక్కింపు, వివరాలు నమోదు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, నిస్పక్షపాతంగా చేపట్టాలన్నారు. ఓటర్ల నిజమైన ఎంపిక సరైన ఓట్ల లెక్కింపులోనే వ్యక్తమవుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రతి దశలోనూ అధికారులు అప్రమత్తతో వ్యవహరించి, ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని, పార్లమెంటుకు 14 టేబుల్స్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 25, మొత్తం 39 టేబుల్స్‌పై పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ప్రత్యేకంగా, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఆయా నియోజకవర్గాల ఇవిఎంల కౌంటింగ్ సెంటర్ల వద్ద నిర్వహించడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు, చెల్లుబాటు కానివి నిర్ధారణ చేసే విషయంలో ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు చేసిన సూచనలపై అధికారులు ప్రత్యేకంగా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

విదేశీ విద్య సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - కాకినాడ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆదిత్య అధినేత శేషారెడ్డి

విదేశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు స్కైలార్క్ అందించే సేవలను వినియోగించుకోవాలని ఆదిత్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి సూచించారు. బుధవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద స్కైలార్క్ కార్యాలయాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతంలో ఉన్న విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించే వారికి మెరుగైన విద్యను అందించాలని సూచించారు. విదేశీ విద్య వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. స్కైలార్క్ సంస్థ డైరెక్టర్, ప్రిన్సిపల్ కన్సల్టెంట్ డాక్టర్ సతీష్ రాజ్ కూచిపూడి మాట్లాడుతూ తన తండ్రి 22 ఏళ్ల క్రితం విశాఖలో ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించి సుమారు 12వేల మంది విద్యార్థులను ప్రపంచ వ్యాప్తంగా అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో చేర్చి వారి ఉన్నత స్థితికి ఎంతో సహకరించారని అన్నారు. తామే ప్రవేశ పరీక్షల కోచింగ్, (ఐఇఎల్‌టిఎస్, టోఫెల్, పిటిఇ, జిఆర్‌ఇ), యూనివర్సిటీ అడ్మిషన్లు, స్కాలర్ షిప్పులు, ఎడ్యుకేషన్ రుణాలు, వీసా, వసతి అలాగే పోస్ట్ డిపార్చర్ సపోర్టుతో సహా ఎండ్ టు ఎండ్ సేవలను అందిస్తున్నామన్నారు. విదేశీ విద్యను అభ్యసించే వారికి తమ స్కైలార్క్ ద్వారా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఇఒ కె.నాగచందన, మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్, బ్రాంచ్ ఇన్‌ఛార్జ్ ప్రవీణ్, రేవతి, ప్రియాంక, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులతో అతిథులు

ప్రతీ విద్యార్థి సామాజిక బాధ్యతతో మెలగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెలికాని స్టాలిన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందన సభ జరిగింది. చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి చదువుతోపాటు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలన్నారు. నిరంతరాయంగా అభివృద్ధి చెందుతున్న సైన్సు, సాంకేతిక ఫలాలు ప్రజలందరికీ అందేలా కృషి చేయాలన్నారు. పెద్దాపురం చేనేత సహకార సంఘం అధ్యక్షులు ముప్పన వీర్రాజు, మండల విద్యాశాఖాధికారి ఇ.ప్రభాకర్‌శర్మ, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రభాకర్‌వర్మ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సి.మూర్తి, జెవివి నాయకులు బి.అనంతరావు, మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి నిర్వాహకులు దేవత రాజేష్‌కుమార్, మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్, యుటిఎఫ్ మండల కార్యదర్శి జాన్‌కెనడి, మాస్టర్ ట్యూషన్ సెంటర్ రఫీ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సత్కరించి మెమోంటోలు అందచేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు రొంగల వీర్రాజు, దారపురెడ్డికృష్ణ, మహపాతిన రాంబాబు, రొంగల వివేక్, నమ్రత, గౌస్ బృందం అభ్యుదయ, దేశభక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వేసవి వినోదం కార్యక్రమంలో చిన్నారులు

స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లీష్, డాన్స్ పై శిక్షణ ఇచ్చారు. స్పోకెన్ ఇంగ్లీష్‌పై ఎస్ఎన్‌విజడ్‌పి హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు జగన్నాథరాజు ప్రత్యేక పాఠాలు బోధించారు. డాన్స్ పోటీలో భాగంగా శాస్త్రీయ, జానపద, వెస్ట్రన్ నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించి తమ ప్రతిభను చాటారు. ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులను న్యాయ నిర్ణేతలు అనంతలక్ష్మి, చిట్టితల్లి, నాని ఎంపిక చేశారు. గురువారం గ్రామ సమస్యలు, పరిష్కార మార్గాలపై వక్తృత్వం పోటీ, అనంతరం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుత్తుల మల్లేశ్వరరావు తెలిపారు.

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.90 కోట్లు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం సత్యదేవునికి హుండీల లెక్కింపు ద్వారా రూ.1,90,41,964 ఆదాయం లభించింది. బుధవారం కొండపైన దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్ సమక్షంలో అధికారులు 36 రోజులు పాటు వివిధ హుండీలలో భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతో పాటుగా 168 గ్రాముల బంగారం, 75 గ్రాములు వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభించినట్లు దేవస్థానం అకౌంట్స్ విభాగం అధికారి అనకాపల్లి ప్రసాద్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

జానపద సాంస్కృతిక ఉత్సవానికి ఆహ్వానం

ప్రజాశక్తి - పిఠాపురం

ఈనెల 30న గుంటూరులో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే జానపద సాంస్కృతిక సంబరానికి తనకు ఆహ్వానం లభించిందని యువ సాహితీవేత్త, రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ కిలారి గౌరీనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జానపద సాహిత్యంలో ప్రజా చైతన్య కళారూపాలు"అనే అంశంపై మాట్లాడటమే కాకుండా జానపద గేయాలను ఆలపించడం జరుగుతుందని తెలిపారు

ఉపాధి హామీలో కూలి రేట్లు పెంచాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉపాధి హామీ పథకంలో కూలి ధరను రూ.600లకు పెంపుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం మండలంలోని ఆనందనగరం, గోర్స తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను కలుసుకుని వారికి ఎదురౌతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద వ్యవసాయ కూలికి 2 ఎకరాల సాగుభూమి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.బోడకొండ, పి.సత్యనారాయణ, సాకా రామకృష్ణ పాల్గొన్నారు.

భీమేశ్వరుని ఆలయంలో జీర్ణోద్ధారణ పనులు

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వరుని శివలింగం జీర్ణోద్ధారణ మరమ్మతులు పనులు బుధవారం ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వాహనాధికారి బళ్ళ నీలకంఠం శివలింగాన్ని జీర్ణోద్ధర పనుల నిమిత్తం కేంద్ర పురావస్తు పర్యవేక్షణ శాఖ కాకినాడ సిఇ కెవిఎన్.మూర్తికి అందచేశారు. తొలుత ఆలయంలో ప్రత్యేక హోమాన్ని ఆలయ పండితులు జరిపించి తదుపరి పనులను ప్రారంభించారు. ఈ పనులు జూన్ 8 వరకూ జరగనున్న క్రమంలో భక్తులు దర్శించుకునేలా ఆలయ నంది మండపంలో ఉత్సవమూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఉపస్తపతి జి.శ్రీనివాసచార్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సేవలందించేందుకు కృషి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



ప్రవీణ్ చక్రవర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

సమాజంలోని పేద ప్రజలకు సేవ చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని చేయూత సంస్థ ఫౌండర్ చేయూత రవికుమార్, రామవరపేట శివాలయం ఛైర్మన్ గేదెల రమేష్, పాండ్రంగి రాజు పిలుపునిచ్చారు. బుధవారం కాకినాడ డి కన్వర్షన్ హాల్లో కెటిఆర్ సంస్థ అధినేత డాక్టర్ ప్రవీణ్‌చక్రవర్తి జన్మదినోత్సవం సందర్భంగా చేయూత, ఆర్‌కె ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా 100మందికి ప్రాణాంతక వ్యాధి గ్రస్తుల చిన్నారులకు పౌష్టిక ఆహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి చిన్నారులకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ పేదలకు అండగా ఉండాలని వివిధ స్వచ్ఛంద సంస్థలు కలిసి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. మా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాండురంగరాజు, వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ, విక్రయాలు బంద్


ప్రజాశక్తి - సామర్లకోట



బాణాసంచా తయారీదారులతో మాట్లాడుతున్న సిఇఒ మూర్తి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసేవరకూ బాణాసంచా తయారీ, విక్రయాలను నిషేధిస్తున్నట్లు జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎవిఎస్ఎన్.మూర్తి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాణాసంచా కేంద్రాల నిర్వహకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. తహశీల్దార్ వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 4వ తేదీన ఎన్నికల లెక్కింపును దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు బాణాసంచా తయారీదారులు తయారీ, క్రయ, విక్రయాలను నిలిపివేయాలని అన్నారు. లైసెన్స్‌లు ఉన్న, లైసెన్సులేని వారైనా ఈ ఆదేశాలను పాటించాలని తెలిపారు. ఎవ్వరైనా బాణాసంచా తయారీ, విక్రయాలు చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రమంతటా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షించేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్ఐ మౌనిక, విఆర్‌ఒ నల్లజర్ల మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆదిత్య పాలిటెక్నిక్‌లో ఉన్నత ప్రమాణాలు

ప్రజాశక్తి - గండేపల్లి



విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా ప్రమాణాలతో సాంకేతిక విద్యను అందిస్తున్న ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలు. మండలంలోని సూరంపాలెంలోని ఆదిత్య నగర్‌లో 200 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ కళాశాలను ఏర్పాటు చేశారు.

విశాల డిజిటల్ తరగతి గదులు, నూతన టెక్నాలజీతో కూడిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ల్యాబొరేటరీ సౌకర్యంతో, జాతీయ అంతర్జాతీయ జనరల్స్, లక్షలాది పుస్తకాలు కలిగిన డిజిటల్ లైబ్రరీలు ఇక్కడ విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ పాలిటెక్నిక్ చేసిన విద్యార్థులు ఈసెట్‌లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ ఏడాది ఈ-సెట్‌లో 5, 6, 8, 8, 10 వంటి 50 లోపు 15 ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. మొదటి సంవత్సరం నుంచే ప్రత్యేక ప్లేస్ మెంట్ ట్రైనింగ్, ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో ప్రత్యేక వర్క్ షాప్‌లు, సదస్సుల నిర్వహణ కళాశాల ప్రత్యేకం. అలాగే రామ్ కో సిమెంట్, టాటా ప్రాజెక్ట్ లిమిటెడ్, ఎల్.అండ్ టి ఇన్ఫోటెక్, ఎల్ట్రానిక్స్, టెక్ మహీంద్రా, అమర్ రాజా, రాయల్ ఇన్‌ఫీల్డ్ వంటి ప్రముఖ సంస్థలతో అవగాహన ఒప్పందం కలిగి ఉండటం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలల విజయానికి సోపానాలు. 175 బస్సులతో విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు.

కాలుష్య రహిత క్యాంపస్

200 ఎకరాల సువిశాల సుందర ప్రాంగణంలో ఆదిత్య విద్యాసంస్థల ప్రాంగణం ఉంది. చక్కటిరోడ్లు, ఉచిత వైఫై సౌకర్యం, సువిశాల క్రీడా ప్రాంగణం, వివిధ రకాల వక్షాలు, కనువిందు చేసే పూలమొక్కలతో పాటూ ఆయుర్వేద మొక్కలతో నిండిన ఆరోగ్యప్రదమైన వాతావరణం ఇక్కడ లభిస్తుంది. కాలుష్య రహిత సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి 2 4గంటలు విద్యుత్‌ను అందిస్తున్నారు. అందువల్లనే 2019లో భారత ప్రభుత్వం నుంచి 'స్వచ్ఛ క్యాంపస్' అవార్డును ఆదిత్య కళాశాల సొంతం చేసుకుంది.

ప్రత్యేకప్లేస్ మెంట్ ట్రైనింగ్ విభాగం

పారిశ్రామిక రంగ నిపుణులతో ప్రత్యేక ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా మొదటి సంవత్సరం నుంచే ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించడం ద్వారా విద్యార్థులను నేటి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రముఖ కంపెనీలో అత్యధిక ప్యాకేజీ రూ.6లక్షలు, రూ.5.40లక్షలు వంటి వార్షిక ఆదాయంతో 913 (93శాతం) మంది ఉద్యోగాలు పొందడం ఆదిత్య విద్యార్థుల ప్రతిభకు ఆదిత్య యాజమాన్యం కృషికి తార్కాణం.

ప్రతిభకు పట్టం

2024-25లో పాలీసెట్ కౌన్సిలింగ్ ద్వారా విద్యార్థులకు 1నుంచి 5వేల వరకూ ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. 5001 నుంచి 10వేల వరకు ర్యాంక్ సాధించిన వారికి బస్సు ఫీజులో 50శాతం రాయితీ కల్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా వరుసగా ఐదేళ్లు 40కి పైగా ప్రతిభా అవార్డులను ఆదిత్య విద్యార్థుల కైవసం చేసుకున్నారు. ఇది రాష్ట్ర పాలిటెక్నిక్ కళాశాలల చరిత్రలోనే ప్రథమం.

హాస్టల్ వసతి

అత్యాధునిక భవన సముదాయం ఎసి/నాన్ ఎసి వసతి సౌకర్యాలు, హైజనిక్ కిచెన్, ఇంటిని మురిపించే విధంగా ఆంధ్ర, తమిళనాడు, కేరళతో పాటు ఉత్తరభారత దేశ రుచులతో కూడిన ఆహారాన్ని ఇక్కడ అందిస్తున్నారు. వైఫై, కంప్యూటర్ సౌకర్యం, నిరంతరాయంగా గ్రంథాలయ విభాగం సేవలు, ఆరోగ్య పరిరక్షణకు వైద్యులు, అత్యవసర సేవలు కోసం అంబులెన్స్, సువిశాల క్రీడా ప్రాంగణం, జిమ్, యోగా తరగతుల నిర్వహణ, ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణ ఆదిత్య హాస్టల్ ప్రత్యేకం.

నాణ్యమైన విద్యను అందిస్తున్నాం



పాలిటెక్నిక్ కళాశాలల్లో అధిక సంఖ్యలో పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే చదువుతున్నారు. వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నత చదువులు చదివేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. మంచి వార్షిక వేతనంతో కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగం వచ్చేలా విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచే పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా శిక్షణ ఇస్తున్నాం. ఇది మంచి ఫలితాలను ఇస్తుంది.

- నల్లమిల్లి సతీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆదిత్య విద్యా సంస్థలు



అందిస్తున్న కోర్సులు : డిసిఇ, డిఇఇఇ, డిఎంఇ, డిసిఎంఇ, డిఇసిఇ, డిసిసిఎన్

పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ కోడ్స్ : ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల కోడ్ : ADTP

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలకోడ్ :ACET

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని బస్ కాంప్లెక్స్‌కి వెళ్ళే దారిలో ఈనెల 21న అపస్మారక స్థితిలో పడి ఉన్న సుమారు 50 సంవత్సరాలు వయసు కలిగిన వ్యక్తిని గుర్తించి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో జాయిన్ చేశారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల పరిధిలోని సూరయ్యపేట వెళ్లే రహదారిలో బుధవారం రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. తాళ్లపూడి పోలీసులు చెప్పిన వివరాల మేరకు...ఈ ప్రమాదంలో బండారు శ్రీనివాస్ (25) మృతి చెందగా ఆయన స్నేహితుడు లక్ష్మణ్ గాయాల పాలయ్యాడు. గాయాల పాలైన లక్ష్మణ్‌ను స్థానిక స్టార్ ఆసుపత్రిలో ప్రాథమిక వైద్య సేవలు అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు తాళ్లపూడి ఎస్ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని రాజులు కొత్తూరు గ్రామ సమీపంలో టి.వెంకటాపురం వద్ద ఈ నెల 19న జరిగిన హత్యకేసులో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ వివరాలను సిఐ ఎస్‌వివిఎస్.మూర్తి బుధవారం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నందిగం ప్రవీణ్ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం కేశవరంలోని డెక్కన్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. 18వ తేదీ రాత్రి తుని ఆర్‌టిసి కాంప్లెక్స్ పక్కనే ఒంటరిగా ఉన్న కోర కుమారిని తన కామవాంఛ తీర్చడం కోసం కొంత నగదును చెల్లించి తాను అద్దెకి ఉంటున్న ఇంటికి తీసుకెళ్లాడు. ప్రవీణ్ ఆమెతో సంతృప్తి చెందలేదు. దీంతో బలవంతం చేశాడు. ఆమె కేకలు వేసింది. ఇరుగుపొరుగు వారు వస్తారనే అనుమానంతో కుమారి గొంతు నొక్కి హత్య చేశాడు. మృతదేహాన్ని ప్లాస్టిక్ సంచిలో కట్టి రాజులు కొత్తూరు సమీపంలో వెంకటాపురం గ్రామం రోడ్డు పక్కన పడేశాడు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసకున్నారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితుని పట్టుకున్న తుని రూరల్ ఎస్ఐ డి.రమేష్‌బాబు, కోటనందూరు ఎస్ఐ బి.శంకర్రావు, తుని పట్టణ ఎస్ఐ జె.విజయబాబు, కోరంకి ఎస్ఐ ఎస్.రవికుమార్‌ను అభినందించారు. వీరికి నగదు రివార్డును ఎస్‌పి చేతుల మీదుగా అందజేశారు.

విద్యార్థులకు విజ్ఞాన శిక్షణ క్యాంప్

ప్రజాశక్తి-పెరవలి

ముక్కామల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ రిసోర్స్ పర్సన్ కె.మధులీల ఆధ్వర్యాన విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పరోపకారి నీతికథ అర్థమయ్యే విధంగా విద్యార్థులకు చెపారు. విద్యార్థులతో చెస్, లూడో ఆడించారు. భారతదేశంలోని నదులు ప్రవాహాలు వాటి ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతల ఎంపిక, స్పోకెన్ ఇంగ్లీష్, విద్యార్థులకు ఇష్టమైన కథల పుస్తకాల చదివించడం, పుస్తక సమీక్ష నిర్వహించారు. విరామ సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ కె.విశ్వనాథం కె.భవాని, మధులీల, గ్రంథాలయ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యానాంలో డిప్యూటీ సిఇఒ పర్యటన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి డిప్యూటీ ఛీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ తిల్లైవేలు బుధవారం యానాంలో పర్యటించారు. ఈ సందర్భంగా యానాంలో కౌంటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక ఎస్‌ఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్రూమ్, కౌటింగ్ హాలును పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రాంతీయ పరిపాలన అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పుదుచ్చేరిలో ప్రధాన ఎన్నికల కార్యాలయానికి కౌంటింగ్ వివరాలు ఎప్పటికప్పుడు అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కౌటింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామన్నారు. ఓట్ల లెక్కింపునకు పగడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలు గురించి అధికారులతో సమీక్షించామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి, ఎస్‌పి రాజశేఖరన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరి

- 8 గంటల నుంచే సూర్యప్రతాపం
- సాయంత్రమూ వదలని వేడి గాలులు
- రోహిణీ కార్తె ప్రభావం


నిర్మానుష్యంగా మారిన కాకినాడ -కత్తిపూడి జాతీయ రహదారి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రోహిణి కార్తె ప్రభావంతో ఎండలు దంచి కొడుతున్నాయి. గత నాలుగు రోజులుగా వరుసగా తీవ్ర వడ గాడ్పులు వీస్తున్నాయి. బుధవారం కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు గాడ్పుల తీవ్రత కొనసాగింది. జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడిపోయారు. అత్యవసర పనులపై వచ్చినవారు ఎండ వేడికి ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మధ్యాహ్నానికి ఇళ్లు నిప్పుల కుంపటిలా మారాయి.

ఉమ్మడి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు అమలాపురం, మండపేట, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోటలలో 40 డిగ్రీల గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పట్టణ, నగర శివారు ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగుతుంది. తుని, అమలాపురంలలో 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు, మూడు రోజుల వరకు జిల్లాలో వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించింది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం 6 గంటలు అయినా వేడి తగ్గడం లేదు.

బయటకు రావాలంటే భయం భయం

నిత్యం పచ్చగా కళకళలాగే ఉమ్మడి జిల్లాలో భిన్న వాతావరణం నెలకొంది. కోనసీమలో సైతం భానుడు బగ్గుమంటున్నాడు. అక్కడ గ్యాస్ కార్యకలాపాలు వలన వాతావరణంలో కాలుష్యం అధికమవ్వడంతో వేడి పెరిగింది. ఎండలకు బయటకు వెళ్ళడానికి జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేస్తున్నారు. మిట్ట మధ్యాహ్నం ఇంట్లో నుంచి కాలు బయటపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఎండల బారి నుంచి రక్షణ పొందాలంటే అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత ఉగ్రరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వ్యాపారాలు వెలవెల

కర్ఫ్యూ వాతావరణం నెలకొనడంతో ఉదయం 11 గంటల వరకే అమ్మకాలకు అవకాశం ఉంది. దాంతో పలు వ్యాపారాలు ఇప్పటికే చాలా వరకు దెబ్బతిన్న పరిస్థితులు నెలకొన్నాయి. అనేకమంది చిరు వ్యాపారులు ఉపాధిని కోల్పోయి వారి కుటుంబ జీవనం కష్టంగా మారింది. ఇప్పుడిప్పుడే వ్యాపారాలు పుంజుకుంటున్నాయని భావిస్తున్న సమయంలో మళ్లీ ఎండలు మండిపోతున్న వేళ కొద్దిమేర జరుగుతున్న వ్యాపారాలు పూర్తిగా బోర్లా పడ్డాయి. కొనే వారు రాక, బేరాలు లేక చిరు వ్యాపారాలన్నీ వెలవెలబోతున్నాయి.

ఉపాధి కూలీలు వెతలు

ఎండ వేడిమిని తట్టుకోలేక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశంలో అధికారులు సరైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో పలు చోట్ల చల్లని మజ్జిగ, తాగునీరు పంపిణీ సక్రమంగా జరగలేదని ఆరోపణలు వచ్చాయి. నీడ కోసం వేయాల్సిన టెంట్లు కూడా కొన్ని ప్రాంతాల్లో సక్రమంగా వేయలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 8 గంటలకే వేడి పెరుగుతుండడం వలన పనులు చేయలేకపోతున్నామని కూలీలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వడదెబ్బకు విలవిల

వడదెబ్బతో ప్రజలు ప్రతి ఏడాది అధిక సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది వడదెబ్బకు గురై తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. శరీర ఉష్ణోగ్రత 106 డిగ్రీ ఫారెన్‌హీట్ దాటితే వడెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. కళ్లు తిరగడం తీవ్రమైన తలనొప్పి, గుండె దడ, చెమట ఎక్కువగా రావడం, కిడ్నీ చెడిపోవడం, పిట్స్ రావడం తదితర లక్షణాలు బయటపడుతున్నాయి.

ఉపశమనం కోసం పరుగులు

ప్రజలు ఎండల తీవ్రతకు అల్లాడిపోతున్నారు. వేడి తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని పానీయాల కోసం ఎక్కడ బడితే అక్కడ నిలిచిపోతున్నారు. కొబ్బరి నీళ్లు, కర్బుజా, పండ్ల రసాలు, చెరకు రసం ఇతర పానీయాలు తాగుతున్నారు. ఎండలు మండుతుండడంతో ఆయా మండల కేంద్రాల్లో కుల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ సెంటర్లు ఎక్కువయ్యాయి. ఎండలో తిరిగే వాహనదారులు, కార్యాలయాల్లో పని చేసేవారు, ఫీల్డ్ వర్క్ చేసేవారు వేడిమికి తట్టుకోలేక కాసేపు సేద తీరేందుకు వీటిని ఆశ్రయిస్తున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం


సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్

ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగ తాయారు ఆదేశించారు. బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీటి బోర్లు, స్పాట్ డెలివరీ ట్యాంకులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, మంచి నీరు సరఫరా జరిగే పైపులైన్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. ఏ రోజు చెత్త పోగులను ఆరోజే తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధాన రహదారి డివైడరులో పర్యవేక్షణ లోపంతో మొక్కలు ఎండిపోతున్నాయన్నారు. ఈ మొక్కలను సంరక్షించే ఏర్పాట్లు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కే.పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, డిఇఇ ఆదినారాయణరావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులు, వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం


గర్భిణులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో ప్రతి బుధవారం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న గర్భిణుల అన్నదానం కార్యక్రమంలో భాగంగా బుధవారం 120 మంది గర్భిణులు, 80 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కృష్ణ, మహేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కర్రి మోహన్, శంకర్, మనోజ్ పాల్గొన్నారు. మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ 81 వ జయంతి సందర్భంగా ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన గర్భిణీలకు, వృద్ధులకు అన్నదానం చేసినట్లు తెలిపారు.

రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం

కరప: కరప గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు రిటైర్డ్ చీఫ్ లేబర్ కమిషనర్ వి.శ్రీనువాసురావు రూ.10 వేల నగదును సాయం చేశారు. కరప శివారు రామకంచిరాజు నగర్‌కు చెందిన చోడబత్తుల అబ్బాయి దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. అలాగే మెరక వీధికి చెందిన నక్క సీతారత్నం క్యాన్సర్ వ్యాధితో ఇటీవలే మరణించారు. ఆ కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు విజ్ఞప్తి మేరకు శ్రీనువాసురావు ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. బాధితులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అమలుకాని పింఛను పంపిణీ సర్క్యులర్


పింఛను పంపిణీ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ (ఫైల్)

ప్రజాశక్తి - మామిడికుదురు

పింఛన్ కానుక నగదు పథకం ద్వారా ప్రతి నెలా పింఛను నగదును గ్రామ సచివాలయం ఖాతాకు జమ చేస్తారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామీణాభివృద్ధి శాఖ ఎపి ప్రభుత్వం నగదు విత్ డ్రా పంపిణీ విధి విధానాలపై సెప్టెంబర్ 2023 న జారీ చేసిన సర్క్యులర్ సూచనలు చాలా చోట్ల అమలు కావడం లేదు. వద్దులు, వికలాంగులు,అభయ హస్తం,చేనేత, ఒంటరి మహిళ,కల్లు గీత, వితంతు, మత్యకార, కిడ్నీ పేషెంట్, కళాకారులు, డిఎమ్‌హెచ్ఒ, డప్పు కళాకారులు, చర్మకారులు ఇలా 13 రకాలు ప్రతినెలా సుమారు రూ.1750 కోట్లలను పింఛన్ పంపిణీకి ప్రభుత్వం నిధులను సచివాలయ ఖాతాకు జమ చేస్తుంది.

వెల్ఫేర్ అసిస్టెంట్ ఒక్కరే విత్ డ్రా

పింఛను నగదు విత్ డ్రా చేయుటకు జిఒ ప్రకారం పంచాయతీ కార్యదర్శి మరియు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఇద్దరు బ్యాంకుకు వెళ్లి పింఛను నగదు విత్ డ్రా చేయవలసినదిగా సర్క్యులర్ లో ఆదేశించారు. జిల్లాలో చాలాచోట్ల సచివాలయాలలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఒక్కరే నగదు విత్ డ్రా చేయడానికి వెళ్లి అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామ సచివాలయాల్లో నగదు పెద్ద మొత్తంలో విత్‌డ్రా చేసి ఒక్కరే సచివాలయానికి తీసుకుని వెళుతున్నప్పుడు నగదు దొంగతనం, లేదా మరేదైనా ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వ నిధులు వథా చేయడమే కాకుండా ఎవరు బాధ్యులని చర్చ వినిపిస్తోంది. బ్యాంకులో నగదు విత్ డ్రా చేసి పంపిణీ చేసే వరకు బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్‌కే వదిలేయకుండా తగు జాగ్రత్తలతో పాటు నగదు పంపిణీ బాధ్యత కార్యదర్శి కూడా వెళ్లి నగదు విత్ డ్రా చేసి వెల్ఫేర్ అసిస్టెంట్ ఇచ్చే బాధ్యత ఇద్దరూ వహించవలసి ఉందని సర్కులర్‌లో సూచించడమే కాకుండా పంపిణీ పర్యవేక్షణ చేయవలసినదిగా కోరడమైనది. పింఛను పంపిణీలో బాగంగా పంచాయతీ సెక్రటరీ అందుబాటులో లేకపోతే సచివాలయ సెక్రటరీ వెల్ఫేర్ అసిస్టెంట్ కలసి పింఛను సొమ్ము బ్యాంకు నుండి నగదు విత్ డ్రా చేసి పింఛను పంపిణీ చేస్తే ఏవిధమైన ఇబ్బందులు తలెత్తవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విత్ డ్రాలకు ఆదేశాలు జారీ చేస్తాం



పింఛను కానుక నగదు విత్ డ్రా పంపిణీలపై పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్లు భాగస్వామ్యులు కావాల్సి ఉంది. చాలా చోట్ల పంచాయతీ కార్యదర్శుల కొరతతో వెల్ఫేర్ అసిస్టెంట్‌కి తోడుగా సచి వాలయ కార్యదర్శి లేదా మహిళా పోలీస్ విధులు నిర్వ హించేలా ఈ విషయమై ఆదేశాలు జారీ చేసి అమలు చేస్తాం.

-కారుపల్లి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ, మామిడికుదురు

వెల్ఫేర్ అసిస్టెంట్‌తో పాటు తోటి సిబ్బందిని పంపిస్తాం



బ్యాంకు నుంచి పింఛను నగదు విత్ డ్రా చేసేందుకు వెల్ఫేర్ కు తోడుగా సచివాలయ కార్యదర్శి లేదా తోటి సిబ్బంది పంపేందుకు చర్యలు తీసుకుంటాం. వద్దులకు పింఛను పంపిణీ లో బాగసాములు కాలేని సచివాలయాల ఉద్యోగులుపై దృష్టి సారించి పింఛను విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేస్తాం.

-కెఎన్‌బివివిఎస్ఎస్‌వి.లక్ష్మి,ఎంపిడిఒ, అంబాజీపేట

కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

ప్రజాశక్తి-అమలాపురం


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శుక్లా ఇతరఉన్నతాధికారులు

స్థానిక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జూన్ నాలుగో తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా 26 జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓ ట్ల లెక్కింపు కేంద్రాల సన్నద్ధతపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎక్కడ ఏ విధమైన పొరపాట్లకు తావులేకుండా పార దర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వ హించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. వెయ్యి మందికి పైగా కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసి స్టెంట్లు, సూక్ష్మ పరిశీలకులు తదితరులతో పాటు దాదాపు 400 మంది ఇతర సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియ, అనుబంధ విధుల్లో పాల్గొంటారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తు న్నామని, సూక్ష్మ పరిశీలన, పాటుగా సీసీ కెమెరాల నిఘా ఉంటుందని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల్లోని ఓట్లను లెక్కించే ప్రక్రియలో భాగస్వాములు కానున్న కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వ ర్లకు నాణ్య మైన శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. కట్టుదిట్టమైన భద్రత, బందోబస్తుకు చేసిన ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రిటర్నింగ్ అధికారులను ఉద్దేశించి జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహిం చారని అదే స్ఫూర్తితో కౌంటింగ్ ప్రక్రియను సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు, జాప్యం లేకుండా ఫలి తాల వెల్లడికి తీసుకోవాల్సిన చర్య లను వివరించారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు వారి తరుపు ఏజెం ట్లకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. మీడియా కేంద్రం అన్ని వసతులతో ఏర్పాటు చేసి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు తాజా సమాచారాన్ని ప్రతి రౌండ్ వారిగా సకాలంలో అందించాలన్నారు. హై స్పీడ్ ఇంటర్నెట్ ద్వారా సమాచారాన్ని వేగ వంతంగా అందించాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఫస్ట్ ఎయిడ్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు స్ట్రాంగ్ రూమ్ తెరిచేందుకు కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 5.30గంట లకు లెక్కింపు కేంద్రానికి హాజరు కావాల న్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 17 సి ఫారం, తెల్లకాగితం మాత్రమే తీసుకురావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. లెక్కింపు కేంద్రం లోనికి ప్రవేశించే వారికి విధిగా పాస్ ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, అడ్మిన్ ఎస్‌పి ఎస్.ఖాదర్ బాషా, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జి.కేశవర్ధన రెడ్డి, వి.మదన్ మోహన్‌రావు, డివిఎస్.ఎల్లారావు, ఎ.శ్రీరామచంద్రమూర్తి, జివివి.సత్యనారాయణ, పార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఎం ఝాన్సీ రాణి ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


క్షేత్రస్థాయిలో వాహన తనిఖీల్లో పాల్గొన్న ఎస్‌పి సతీష్‌కుమార్

జిల్లాలో 144 సెక్షన్ అమలు : ఎస్‌పి

ప్రజాశక్తి - పిఠాపురం

ఎన్నికల కౌంటింగ్, ఎలక్షన్ కోడ్ ముగిసే వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం పిఠాపురంలో డిఎస్‌పి కె.హనుమంతరావు ఆధ్వర్యంలో నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చిత్రాడ, పాదగయ జంక్షన్, ఎఫ్‌కె పాలెం సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, చర్చ్ సెంటర్, ఉప్పాడ బస్‌స్టాండ్ సెంటర్ పలు ప్రాంతాల్లో వందలాది ద్విచక్ర వాహనాలను పోలీసులు సాయంత్రం 5గం నుంచి 7 గం వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహన తనిఖీల ప్రక్రియను ఎస్‌పి సతీష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సజావుగా సాగేందుకు ముందస్తు చర్యలో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, లైసెన్సులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు ఉన్నవాటిని పోలీస్ స్టేషన్ తరలిస్తామని, సరైన ధ్రువపత్రాలు చూపిస్తే వాటిని వెంటనే వాహనదారులకు అప్పగిస్తామన్నారు. లేకుంటే కోర్టు ద్వారా తిరిగి వాహనాలను వాహనదారులు పొందవలసి ఉంటుందన్నారు. కౌంటింగ్ రోజు సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుందని ఎవరైనా ఇలా వాహనాలపై తిరిగితే ఖచ్చితంగా వారి మీద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే పోలింగ్ రోజు జరిగిన చిన్న చిన్న సంఘటనలో పాల్గొన్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశామని, వారిపై సెస్పెక్ట్ షీట్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. మొదటి కేసులో ఇన్వాల్వ్ అయినవారికి 41ఎ నోటీస్ ఇవ్వడం జరిగిందని, వాళ్ళు మరల వేరొక కేసులో ఉంటే వారిని కోర్టులో హాజరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ డిఎస్‌పి ప్రమోద్, పిఠాపురం సిఐ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి ఉచిత తరగతులు

ప్రజాశక్తి - కరప

జనవిజ్ఞాన వేదిక కరప మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి కరప గ్రామంలో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని శివాలయం వీధిలో భవన నిర్మాణ కార్మికుల భవనంలో ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ఉచితంగా క్లాస్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యోగాసనాలపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం



యోగసానాల్లో విద్యార్థులు

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో బుధవారం విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో వానపల్లి సత్యనారాయణ విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించి వారితో యోగాసనాలు వేయించారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సింగం బుల్లియ్య, బి.రాజేష్, బి.అరవింద్, టి.కాటమరాజు, రామారావు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ భౌతిక శాస్త్రం పరీక్షకు 1,171 మంది హాజరు

ప్రజాశక్తి- ముమ్మిడివరం

పదవ తరగతి సప్లమెంటరీ భౌతిక శాస్త్రం పరీక్షకు సంబంధించి జిల్లాలో 2085 మంది విద్యార్థుల హాజరు కావలసి ఉండగా 1171 మంది పరీక్షలకు హాజరైనట్లు బుధవారం డిఇఒ ఎం. కమల కుమారి తెలిపారు. జిల్లాలో వీరి కోసం 16 సెంటర్లు ఏర్పాటు చేయగా 1171 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 914 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, ఫ్లయింగ్ స్క్వాడ్ 4 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేయగా డిఇఒ ఎం.కమల కుమారి 3, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం.సురేష్ 2 పరీక్ష కేంద్రాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. కాగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 81 మందికి కేవలం 18 మంది హాజరు కాగా 63 మంది గైర్హజరయ్యారని ఎంఇఒ బి.రమణశ్రీ తెలిపారు.

ఓట్ల లెకింపుపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- రామచంద్రపురం

జూన్ 4న ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని, రామచంద్రపురం మార్కెట్ సెంటర్‌లో పోలీసులు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. పట్టణ పరిధిలో ఎటువంటి కోట్లాటలు, గొడవలు జరగకుండా ప్రజలకు అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. జూన్ 6 వరకూ సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున, నలుగురు అంతకంటే ఎక్కువ మంది గుమికూడడానికి వీలులేదని ఎగ్జిట్ పోల్స్ వెలువడిన తర్వాత కానీ ఎలక్షన్ ఫలితాలు విడుదలైన తర్వాత గానీ భావోద్వాగాలకు లోనయ్యి, ఇతరులను రెచ్చగొట్టడం గానీ, ఇతరుల మనోభావాలు దెబ్బ తినేటట్లు ప్రవర్తించడం గాని చేసినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ బాబు హెచ్చరించారు. ఊరేగింపులు,బాణాసంచా కాల్చడం నిషేధించామన్నారు.

పవన్‌పై ఆరోపణలు తగవు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై వైసిపి నాయకుడు పితాని ఆరోపణలు తగవని ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక శ్రీ కృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపం అవరణ లో బుధవారం విలేకరుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పుండరిష్ మాట్లాడుతూ ఇటీవల ఒక న్యూస్ ఛానల్ డిబేట్లో వైసిపి పార్టీ నాయకుడు పితాని బాలకృష్ణ జనసేనాని పైన, పార్టీ పైన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇకపై ఇటువంటి ఆరోపణలు చేస్తే జనసేన పార్టీ కూడా ఆరోపణలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. శెట్టి బలిజ సామాజిక వర్గానికి జనసేన పార్టీలో అన్యాయం జరిగిందని పితాని పేర్కొనడం హాస్యాస్పదం అన్నారు. సమావేశంలో గుద్దటి జమ్మి, దూడల స్వామి, మోకా బాల ప్రసాద్, అత్తిలి బాబురావు తదితరులు పాల్గొన్నారు.